క్లుప్తంగా

ట్రాక్టర్, జేసీబీ పట్టివేత



స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్, జేసీబీ

మిరుదొడ్డి(దుబ్బాక): కూడవెల్లి వాగు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌తోపాటు, ఇసుకను తవ్వడానికి వినియోగించిన జేసీబీని సైతం స్వాధీనం చేసుకున్నట్టు ఏఎస్‌ఐ శేఖర్ శనివారం తెలిపారు. ట్రాక్టర్, జేసీబీతోపాటు డ్రైవర్‌ను తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి ఎదుట బైండోవర్ చేసినట్లు చెప్పారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

పారదర్శకంగా ఎంపిక



పనులను పరిశీలిస్తున్న ఆర్డీఓ సదానందం

చిన్నకోడూరు(సిద్దిపేట): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతోందని, ఎవ్వరూ ఆందోళన చెందవద్దని సిద్దిపేట ఆర్డీఓ సదానందం అన్నారు. మండల పరిధిలోని మైలారంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను శనివారం పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. సకాలంలో బిల్లులు అందే విధంగా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జనార్దన్, ఎంపీఓ సోమిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆయాలకు శిక్షణ



శిక్షణ ఇస్తున్న రేణుక తదితరులు

మద్దూరు(హుస్నాబాద్): ధూళ్మిట్ట మండల కేంద్రంలోని రైతు వేదికలో రిలయన్స్ అండ్ క్రై ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ ఆయాలకు శనివారం ప్రత్యేక శిక్షణ అందించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రేణుక పరిశుభ్రత, పిల్లలను ఎలా చూసుకోవాలనే అంశాలపై అవగాహన కల్పించారు. బ్లాక్ కోఆర్డినేటర్ నవత ఈవెంట్స్ సమయంలో, పిల్లలకు ప్రిస్కూల్ కార్యక్రమాలలో హెల్పర్ల పాత్ర గురించి వివరించారు. కార్యక్రమంలో సెక్టార్ పరిధిలోని ఆయాలు పాల్గొన్నారు.

ఎరువులు ఇవ్వాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): సకాలంలో సరిపడా ఎరువులు అందించాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రైతులకు శనివారం తహసీల్దార్ సలీమ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షులు శ్రీనివాస్, సొసైటీ చైర్మన్‌లు కనకరాజు, సదానందం మాట్లాడుతూ రైతు ప్రభుత్వం అంటూ రైతులను వంచిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇకనైనా రైతులకు సరిపడా ఎరువులు సకాలంలో అందించాలన్నారు. ఎరువులు, విత్తనాల కొరత వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. కార్యక్రమంలో నాయకులు పాపయ్య, వెంకటేశం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

19వ సారి రక్తదానం



రక్తదానం చేస్తున్న కరుణాకర్

గజ్వేల్‌రూరల్: ఆర్‌ఎంపీ కరుణాకర్ 19వ సారి రక్తదానంచేసి అందరి మన్ననలను పొందాడు. మండల పరిధిలోని చిన్న ఆరెపల్లికి చెందిన ఎండీ ఖాసీం గుండె శస్త్ర చికిత్స చేసేందుకు ఓ నెగిటివ్ రక్తం అవసరమైంది. విషయం తెలుసుకున్న ఆర్‌ఎంపీ కరుణాకర్ శనివారం ఆస్పత్రికి వెళ్ళి రక్తదానం చేశాడు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు 19 సార్లు రక్తదానం చేశానన్నారు. ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేసేందుకు తాను సిద్ధంగా ఉంటానని చెప్పారు.

నిర్మాణాలు నిరుపయోగం

చిట్టీల నిర్వహణ, ఇతర అవసరాల కోసం మహిళ సంఘాల సభ్యులు ప్రతి గ్రామంలోను మహిళ సమైఖ్య భవనాలు నిర్మించారు. గ్రూపు సభ్యులకు పలు అంశాలపై అవగాహన, గ్రామసభలను ఈ భవనాల్లో నిర్వహిస్తుంటారు. కానీ ఎక్కడా భవనాలను వినియోగించుకోవడం లేదు. దీంతో ఆ భవనాలు నిరుపయోగంగా మారాయి.

- వినియోగించని మహిళ సమైఖ్య భవనాలు
- ఇబ్బందులు పడుతున్న గ్రూపు సభ్యులు
- పలుచోట్ల శిథిలావస్థలోకి..



గోపాల్‌పూర్‌లో నిరుపయోగంగా ఉన్న మహిళ సమైఖ్య భవనం

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని 29 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మొత్తం 841 మహిళ గ్రూపులు ఉండగా 8,882 మంది సభ్యులు ఉన్నారు. గ్రామాలను బట్టి పది నుంచి 80 వరకు గ్రూపులు ఉన్నాయి. ఒక గ్రూపులో కనీసం పది మంది సభ్యులు ఉన్నారు. ప్రభుత్వం మహిళల ఉపాధి కోసం, ఇతర అవసరాల నిమిత్తం రుణాలను అందిస్తుంది. దీంతో ప్రతినెల మహిళ గ్రూపు సభ్యులు ఒకచోట కలిసి చిట్టీల నిర్వహణ చేసుకోవాల్సి ఉంటుంది.

లక్షల నిధులతో నిర్మాణం

గత ప్రభుత్వాలు మహిళల కోసం రూ.లక్షల నిధులతో గ్రామాల్లో భవనాలు నిర్మించాయి. అందులో దుకాణ సముదాయం కోసం షట్టర్, సమావేశ గది, వరండా ఉంటాయి. కానీ మండలంలోని చాలా గ్రామాల్లో మహిళ సమైఖ్య భవనాలు వినియోగంలో లేవు.

నిధులు నిరుపయోగమే..

గోపాల్‌పూర్ గ్రామంలోని మహిళా సమైఖ్య భవనం శిథిలావస్థకు చేరింది. తిగుల్ గ్రామంలో అంగన్‌వాడీలో కొనసాగుతోంది. అలిరాజ్‌పేటలోని భవనంలో పంచాయతీ కొనసాగుతోంది. తిమ్మాపూర్, రాయవరం, చిన్నకిష్టాపూర్, చాట్లపల్లి, వట్టిపల్లి, మునిగడప, గొల్లపల్లి, ఇటిక్యాల, జగదేవ్‌పూర్, లింగారెడ్డిపల్లి, ధర్మారం, పీర్లపల్లి తదితర గ్రామాల్లోని భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో రూ.లక్షల నిధులు బూడిదలో పోసిన పన్నీరులా మారాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వినియోగంలోకి తీసుకువస్తాం

మండలంలోని కొన్ని గ్రామాల్లో మహిళ సమైఖ్య భవనాలు నిరుపయోగంగా ఉన్నమాట వాస్తవమే. కొన్ని గ్రామాల్లో పంచాయతీ భవనాలు లేకపోవడం వల్ల మహిళ భవనాల్లోనే పంచాయతీ నిర్వహణ చేపడుతున్నారు. నిరుపయోగంగా ఉన్నవాటిని వెంటనే వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటాం.

– కిరణ్, ఏపీఎం, జగదేవ్‌పూర్

సొంతింటి కలను సాకారం చేసిన సీఎం

డీసీసీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి



కొమురవెల్లిలో భూమిపూజ చేస్తున్న ప్రతాప్‌రెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): పేదోడి సొంతింటి కలను సాకారం చేసింది సీఎం రేవంత్‌రెడ్డి అని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరిప్రతాప్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో నాయకులతో కలిసి ఇటీవల మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శనివారం భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఒక్క పేదవాడికి కూడా ఇల్లు మంజూరు చేయలేదన్నారు. విడతల వారీగా పేదలందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మహదేవుని శ్రీనివాస్, మేర్గు శ్రీనివాస్, లింగంపల్లి శ్రీనివాస్, కనకరాజు, జంగని రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు

చిన్నకోడూరు(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మీసం మహేందర్, సేవాదళ్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ అన్నారు. మండల పరిధిలోని ఎల్లాయపల్లి, కిష్టాపూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గులు పోసి లబ్ధిదారులతో కలిసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు అందజేస్తారని, లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతోందన్నారు.

ప్రతి గ్రామంలో జెండాలు ఎగురవేయాలి



మాట్లాడుతున్న మంద కుమార్

ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి మంద కుమార్

గజ్వేల్: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 7న ప్రతి గ్రామంలోను జెండాలు ఎగురవేసి సంబురాలు జరుపుకోవాలని మహాజన సోషలిస్టు పార్టీ(ఎంఎస్‌పీ) జాతీయ నాయకుడు, ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి మంద కుమార్ మాదిగ పిలుపునిచ్చారు. గజ్వేల్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. న్యాయబద్ధమైన డిమాండ్ కావడం వల్లే ఎస్సీ వర్గీకరణ పోరాటం విజయవంతమైందని, 9 శాతం రిజర్వేషన్లను ఉపయోగించుకొని మాదిగలు విద్యా, ఉద్యోగ రంగాల్లో రాణించాలని సూచించారు. ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ ప్రకారం ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లా కో–ఇన్‌చార్జి యాదగిరి, గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆంజనేయులు పాల్గొన్నారు.

భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దు

అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్



పరేడ్‌ను పరిశీలిస్తున్న సుభాష్ చంద్రబోస్

చిన్నకోడూరు(సిద్దిపేట): ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌ల జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్ అన్నారు. మండల పరిధిలోని పెద్దకోడూరు శివారులోని సీఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో జిల్లాలోని సివిల్, రిజర్వ్ పోలీస్, హోంగార్డు సిబ్బందికి నిర్వహించిన పరేడ్‌ను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది క్రమం తప్పకుండా వాకింగ్, రన్నింగ్, యోగా వంటివి చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. అలా చేస్తే శక్తి, సామర్థ్యలతో.. ఎలాంటి అనారోగ్యానికి గురికాకుండా విధులు నిర్వహించడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. విధులలో నిర్లక్ష్యం వహిస్తే పోలీస్ శాఖ ప్రతిష్ఠకు భంగం కలిగించే వారవుతారన్నారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌లు, ఆర్‌ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి పొన్నం పరామర్శ

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని బస్వాపూర్ గ్రామంలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన కాంగ్రెస్ నాయకుడు కాల్వ రాజు కుటుంబాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్త కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయన వెంట పార్టీ మండలాధ్యక్షుడు మంద ధర్మయ్య తదితరులు ఉన్నారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి: ఎస్‌ఎఫ్‌ఐ



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): పెండింగ్‌లో ఉన్న ఉపకారవేతనాలు, పీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి కర్రోల్ల లెనిన్‌రాజు డిమాండ్ చేశారు. కార్యకర్తలతో కలిసి శనివారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఉపకారవేతనాలు, పీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న రూ.8,200 కోట్ల ఉపకారవేతనాలు, రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, లేని పక్షంలో కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు చందు, ప్రణీత్, భరత్ పాల్గొన్నారు.

విమర్శలను సహించం

గజ్వేల్: ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటున్న డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డిపై బీజేపీ నాయకులు ఇష్టానుసారంగా విమర్శలు చేస్తే సహించేదిలేదని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్ హెచ్చరించారు. శనివారం గజ్వేల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎంపీ రఘునందన్‌రావు గజ్వేల్‌కు ఏమి చేశారో బీజేపీ నాయకులు ముందు చెప్పాలని డిమాండ్ చేశారు.

సంక్షిప్త వార్తలు

◆ **కార్మిక కోడ్‌లను రద్దు చేయండి**

ములుగు(గజ్వేల్): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య డిమాండ్ చేశారు. శనివారం ములుగులో ఆయన విలేకరులతో మాట్లాడారు. పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి, కార్మికులను బానిసలుగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. పరిశ్రమలలో భద్రత ప్రమాణాలను యజమానుల వదిలేసిందని ఆరోపించారు. సమస్యల పరిష్కారం కోసం 9న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను కార్మికులు జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో నాయకులు నగేశ్, మల్లేశ్ పాల్గొన్నారు.

◆ **సమ్మెనోటీసు అందజేత**

మిరుదొడ్డి(దుబ్బాక): హక్కుల సాధన కోసం కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని సీఐటీయూ మండల కార్యదర్శి మద్దెల అంజయ్య పిలుపునిచ్చారు. పంచాయతీ కార్మికులు ఎంపీడీఓ గంగుల గణేశ్‌రెడ్డి, ఎంపీఓ జహూరొద్దీన్‌కు శనివారం సమ్మె నోటీసులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాల రాస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన పారిశుధ్య కార్మికులు నవీన్, సురేందర్, మహేశ్, నవీన్, పరశురాములు, పోచయ్య, చంద్రం పాల్గొన్నారు.

◆ **రైతులకు అండగా సహకార సంఘాలు**

ములుగు(గజ్వేల్): రైతులకు సహకార సంఘాలు ఆర్థికంగా తోడ్పాటును అందిస్తున్నాయని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్, ఉమ్మడి మెదక్‌జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి, వైస్ చైర్మన్ నరేశ్‌గౌడ్ అన్నారు. శనివారం అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని పురస్కరించుకుని పీఏసీఎస్ కార్యాలయంలో సహకార జెండాను ఎగురవేశారు. సీఈఓ రమేశ్‌బాబు, డైరెక్టర్లు రమేశ్, రాములుగౌడ్, సత్తయ్య, భంగ్యా పాల్గొన్నారు.

దుబ్బాకలో..

దుబ్బాకటౌన్: దుబ్బాకలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(పీఏసీఎస్) కార్యాలయం ఎదుట చైర్మన్ శేర్ల కైలాస్ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నరేశ్, డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

◆ **సహాయనిధి చెక్కుల అందజేత**

దౌల్తాబాద్(దుబ్బాక): మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను పంజస్వామి శనివారం అందజేశారు. పూసపల్లి లక్ష్మికి రూ.5 వేలు, పంజ భూమయ్యకు రూ.22,500లు, పంజ వరలక్ష్మికి రూ.36 వేలు చెక్కులను పంపిణీ చేశారు. నరసింహ, ఆగం, భాస్కర్, ప్రశాంత్, షాదుల్, కుమార్, సంపత్, మల్లారెడ్డి, పాల్గొన్నారు.

◆ **ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన**

వర్గల్(గజ్వేల్): రైతులు, ఖాతాదారులు గ్రామీణ వికాస్‌బ్యాంక్ సేవలను వినియోగించుకోవాలని నాచారం బ్రాంచ్ మేనేజర్ సోమనాథ్ సూచించారు. మండలంలోని అనంతగిరిపల్లిలో శనివారం ఆర్థిక అక్షరాస్యత సదస్సు నిర్వహించారు.

◆ **పుస్తకాల పంపిణీ**

మిరుదొడ్డి(దుబ్బాక): సిద్దిపేట అలయన్స్ ఇంటర్నేషనల్ కమిటీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని కాసులాబాద్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం వివిధ రకాల పుస్తకాలు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో అలయన్స్ సిద్దిపేట జిల్లా గవర్నర్ గందె ఈశ్వర్ చరణ్, జిల్లా క్యాబినెట్ సెక్రటరీ ధనుంజయ, కమిటీ చైర్మన్ ఆత్మ రాములు, నల్ల ధనుంజయ, గంగిశెట్టి కైలాసం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ **చికిత్స పొందుతూ మృతి**

సిద్దిపేటకమాన్: పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు యత్నించాడు. టూటౌన్ సీఐ ఉపేందర్ వివరాల ప్రకారం... మంతపురి సింగరయ్య (45) భార్య ఇద్దరు కుమారులతో కలిసి పట్టణంలోని మహాశక్తి నగర్‌లో నివాసం ఉంటున్నారు. సింగరయ్యకు ఆరోగ్యం బాగాలేనందున ఏ పని చేయకపోవడంతో కుటుంబ పోషణ నిమిత్తం, ఇంటి నిర్మాణం కోసం చేసిన అప్పులు తీర్చలేకపోయాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై శుక్రవారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు.

రసాయనాల వల్లే తగ్గుతున్న తేమ

- లోడి సంస్థ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ బాలశౌరి
- భూమిలో తేమ, నీటి నిల్వలపై శిక్షణ



రైతులకు అవగాహన కల్పిస్తున్న బాలశౌరి

అక్కన్నపేట(హుస్నాబాద్): రసాయన ఎరువులు అధిక మోతాదులో వాడటం వల్ల భూమిలో తేమ శాతం తగ్గిపోతోందని, రైతులు సేంద్రియ ఎరువులనే వాడాలని లోడి సంస్థ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ బాలశౌరి అన్నారు. మండలం పరిధిలోని వివిధ గిరిజనతండాల్లో శనివారం లోడి సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో మానోస్ యూనిదాస్ సహకారంతో రైతులకు భూమిలో తేమ, నీటి నిల్వలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలశౌరి మాట్లాడుతూ వేసవిలో భూగర్భ జలాలు కూడా రోజురోజుకూ అడుగంటి పోతున్నాయన్నారు. ఇంకుడుగుంతలు, రాతికట్టలు, మట్టి కట్టలు, ఏటవాలుగా ఉన్న పొలాల్లో కందకాలు తవ్వించడం ద్వారా నీరు వృథా కాకుండా భూమిలోకి ఇంకుతుందని సూచించారు. తద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయని, రైతులందరూ వీటిపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ మండల ఫీల్డ్ కో–ఆర్డినేటర్ కోడం సత్యనారాయణ, కనకం, రవీందర్, మూడావత్ తిరుమల, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఆషాఢ త్రిరాత్రోత్సవాలు



మాట్లాడుతున్న విద్యాశంకర భారతిస్వామి

మార్కూక్: మండలంలోని పాండురంగ ఆశ్రమంలో ఆషాఢ త్రిరాత్రోత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతిస్వామి విశిష్ట అతిథిగా పాల్గొని అఖండ భగవాన్ నామ క్రతువును సంప్రదాయబద్ధంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పకుండా రోజు సాయంత్రం భగవాన్ నామస్మరణ చేయాలన్నారు. ఓవైపు నాదం మరో వైపు సాదం(అన్నదానంతో నిరంతరం అలరారే పాండురంగ ఆశ్రమం అంటే తనకు ఎంతో ఇష్టమని చెప్పారు. తొలి ఏకాదశి పర్వదినాన ప్రతి ఒక్కరూ నిరంతరం భగవాన్ నామస్మరణ చేసి తరించాలని సూచించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం భక్తులకు జల్లు స్నానం, ఉపహారం, తేనీరు సేవలు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

వైభవం.. అమ్మవారి దివ్య నామం



చండీ హోమంలో పాల్గొన్న భక్తులు

- ఘనంగా ఛండీ హోమం, సామూహిక పారాయణం

దుబ్బాక: అమ్మవారి దివ్యనామం వైభవం అని శ్రీమద్‌దేవి భాగవత ప్రవచన కర్త విశ్వశర్మ అన్నారు. పట్టణంలోని ఆర్యవైశ్య భవన్‌లో లలితా సేవా సమితి ఆధ్వర్యంలో గత 26 నుంచి నిర్వహిస్తున్న శ్రీమద్‌దేవి భాగవతప్రవచన మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా శనివారం ఛండీ హోమం, సామూహిక పారాయణం, అన్నదానం కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. విశ్వశర్మ మాట్లాడుతూ యజ్ఞాలు నిర్వహించడం ద్వార కష్టాలు తొలగి ప్రజలు సుఖసంతోషాలతో ఉంటారన్నారు. మనిషిలోని రాక్షసత్వాన్ని బయటకు పారద్రోలాలంటే నిత్యం అమ్మవారిని పూజించాలని సూచించారు. కార్యక్రమంలో లలితా సేవాసమితి సభ్యులు నల్ల కళావతి, పద్మ, స్వరూప, రాణి, వేదపండితులు జయరామశర్మ, రామకృష్ణశర్మ, వాసవిక్లబ్ ప్రతినిధులు చింత రాజు, నల్ల శ్రీనివాస్, నాగేందర్, చింత శ్రీనివాస్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక



లిఖిత్‌రెడ్డి



తేజశ్రీ



విజ్ఞాన్‌రెడ్డి



శ్రీజ

నంగునూరు(సిద్దిపేట)/కొండపాక(గజ్వేల్): బాసర ట్రిపుల్ ఐటీకి నంగునూరు మండలం నుంచి నలుగురు విద్యార్థులు, కొండపాక మండలంలోని మరో ఇద్దరు ఎంపికయ్యారు. నంగునూరు ఉన్నత పాఠశాలకు చెందిన గడ్డం లిఖిత్‌రెడ్డి, బందారం తేజశ్రీ, రొడ్డ విజ్ఞాన్‌రెడ్డి, నర్మెట పాఠశాలకు చెందిన పిల్లి శ్రీజ ఎంపికయ్యారు. పదో తరగతిలో పది జీపీఏ సాధించిన వారిని ఎంఈఓ దేశిరెడ్డి, హెచ్‌ఎం రామస్వామి శనివారం అభినందించారు. అలాగే సిర్సనగండ్ల హైస్కూల్‌కు చెందిన పాశం నక్షత్ర, కొండపాకలోని మోడల్ స్కూల్‌కు చెందిన నాగచైతన్యకు ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి అభినందనలు తెలిపారు.

ఎఫ్‌ఎం కోసం బండి సంజయ్‌కు వినతి



కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి వినతి పత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

హుస్నాబాద్: హుస్నాబాద్‌లో ఎఫ్‌ఎం రేడియో స్టేషన్ ట్రాన్స్‌మీటర్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని బీజేపీ నాయకులు కోరారు. కరీంనగర్‌లోని పార్లమెంట్ కార్యాలయంలో మంత్రికి శనివారం వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ వరంగల్‌లో ఉన్న ఎఫ్‌ఎం రేడియో స్టేషన్ నుంచి హుస్నాబాద్‌కు ఎత్తైన గుట్టల కారణంగా ప్రసారాలు ప్రజలకు అందుబాటులో లేవన్నారు. దీంతో పట్టణ ప్రజలు ఎఫ్‌ఎం సేవలు పొందలేకపోతున్నారని, పట్టణంలో ఎఫ్‌ఎం రేడియో స్టేషన్ ట్రాన్స్‌మీటర్ ఏర్పాటు చేసేందుకు కృషిచేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో లక్కిరెడ్డి తిరుమల, దొడ్డి శ్రీనివాస్, రాయికుంట చందు ఉన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తం



హుస్నాబాద్: మాట్లాడుతున్న ఏఎస్‌ఐ మణెమ్మ

బెజ్జంకి(సిద్దిపేట): రోజు రోజుకు కొత్త కొత్త విధానాలతో జరుగుతున్న సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ తిరుపతిరెడ్డి సూచించారు. మండలంలోని వీరాపూర్‌లో శనివారం వివిధ నేరాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లకు వచ్చే ఫేక్ మెసేజ్‌లు, కొత్త యాప్‌ల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. అనంతరం వీరాపూర్‌లో గ్రామస్తులు నూతనంగా ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలను ప్రారంభించారు.

గంజాయి జోలికి వెళ్లొద్దు..

హుస్నాబాద్: విద్యార్థులు గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా చదువుపై దృష్టి సారించాలని ఏఎస్‌ఐ మణెమ్మ పిలుపునిచ్చారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మహిళల రక్షణకు ఉన్న చట్టాలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల రక్షణకు నూతన చట్టాలు పెద్దపీట వేశాయన్నారు. అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మి మోసపోయి జీవితాలను నాశనం చేసుకోవద్దని చెప్పారు. విద్యార్థి దశ చాలా కీలకమైనదని, ఏకాగ్రతతో విద్యను అభ్యసించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్, షీటీమ్ సభ్యులు పాల్గొన్నారు.